# బంగాళాలో కాపురం

కాళ్ళూరి వెంకటరామారావు గారు

నాకు చిన్నతనంనుంచీ మా అంటుమామిడితోటలో వున్న బంగాళాలో కాపురం ఉండాలని మహాకోరికగా ఉండేది. నే నీకోరిక చెప్పినప్పుడల్లా "ఏడిసినట్టే వుంది. బంగాళాలో కాపురం యేమిటే? మహారాజులాగ ఊళ్లో ఉండకుండాను" అని మానాన్న కసురుతూవుండేవాడు. కాని ఆకోరికమాత్రం నాలో అల్లా నిల్చిపోయింది.

ఇంతలో నేను ఇంటరుమీడియేటు చదువుతూ వుండగా మానాన్న చచ్చిపోయేడు. అందుచేత చదువు చాలించి యింటికి రావలసివచ్చింది.

మానాన్న చచ్చిపోయిన రెండునెల్లకి, ఆ విచారం కొంత తగ్గినతర్వాత, నాపాతకోరిక మళ్లా తలయెత్తింది. తక్షణం తోటలో బంగాళాకి వెల్లవేయించి అందులో ప్రవేశించేను.

మా గ్రామానికీ, తోటకీ ఒక మైలుదూరం. ఆ గ్రామం ప్రోప్రయిటరీ మాదే అవడంచేత మాకు నౌఖర్లకీ చాకర్లకీ యేమీ లోటు లేకుండా జరిగేది.

ప్రతిశుక్రవారమూ మా మైసూరు యెడ్లబండీ కట్టుకుని సంతకి వెళ్లి వారానికీ కావలసిన సామానులూ కూరనారలూ తెచ్చి యింట్లో పడేసేవాణ్ణి. బంగాళా చుట్టూ పువ్వులు మొక్కలు వేయించి ఎంతో మనోహరంగా చేయించేసేను.

నాకు వచ్చే రాబడి సరిగా వసూలు చెయ్యడానికి నాకే ఒకగుమాస్తా కావలసివస్తే, నేను వేరే ఉద్యోగంకోసం ప్రయత్నం చెయ్యలేదని వేరే చెప్పాలా?

౨

బాలభానుని లేతకిరణాల్లో మా పూలచెట్లమీద పడ్డ మంచుబిందువులు మిలమిల మెరిసిపోతూ ఉండేవి. అనేకరంగులరెక్కలతో సీతాకోకచిలకలు మాతోట్లో ఉన్న పువ్వులతో ఆడుకునేవి. అనేకజాతుల పూలమీదనుంచి వచ్చేచల్లని గాలి సువాసనలుజల్లుతూ హాయిగా ఉండేది.

అల్లాంటి సమయాన్ని ఉదయాన్నే లేచి, కాఫీ తాగి, మా బంగాళా దక్షిణవైపు వసారాలో పడకకుర్చీలో కూర్చుని 'రైనాల్డ్సునోవల్సు' చదువుకుంటూ ఉంటే, నా కదే స్వర్గంలాగ ఉండేది.

పదకొండు గంటలకి మాఅమ్మ పిలవడమే తడవుగా భోజనం చేసేవాణ్ని. మధ్యాహ్నం మూడుగంటలకి నిద్రలేచి, ఫలారంచేసి, గుమాస్తా చూపించిన కాగితాలు చూసుకుని మాతోటలో చీకటి పడేవరకూ తిరుగుతూ ఉండేవాణ్ని.

"ఒక్కమారూ పొలంలో కెళ్లవేమిరా నాయనా? వ్యవసాయం యెల్లా తగులడుతూందో బొత్తిగా అక్కర్లేదట్రా?" అని మాఅమ్మ యెన్నిమార్లు చెప్పినా నాకు పొలమ్మీదకి వెళ్లేబుద్ధి పుట్టేదికాదు.

కాని అసలే వూరుకుంటే బొత్తిగా అనువు చేసేస్తారని సాయంత్రంవేళ ఒక్కొక్కమారు తిరిగి అది బాగులేదనీ యిదిబాగులేదనీ వాళ్లమీద 'హాత్, హూత్' అని కేకలేసేవాణ్ని.

౩

నేను యఫ్. ఏ. చదువుతూ వుండగానే నాకు వివాహమైంది. పండుక్కి మా మామగారు వచ్చి నన్ను రమ్మని పిలిచేరు. నేనూ ఒక బంట్రోతుని తీసుకుని బైలుదేరేను.

నేను మా అత్తవారింట్లో ఆసారి ఆరురోజులున్నాను. అప్పటికి నాభార్యకి పదమూడు సంవత్సరాలుంటాయి.

మావివాహం అయినతర్వాత నేను అదే మా అత్తవారింటికి మొదటిసారి రావడం. చాలాకాలం అయి

నందుచేత నాభార్యను ఒక్కసారి చూడ్డానికి నాకు కుతూహలంగా ఉండేది.

అందుచేత ఏపనీ లేకపోయినా యేదోవొక వంక పెట్టుకుని పెరట్లోకీ, యింట్లోకీ నేను తిరుగుతూ ఉండేవాణ్ణి కాని నేనువస్తూన్నట్టు యేమాత్రం సడి గట్టి నాగాని తుఱ్ఱున మెరుపుమెరిసినట్లు ఆఅమ్మాయి పారి పోతూవుండేది. అంతేకాని రెండు నిముషాలైనా ఆమెను సరీగా తనివిదీరా చూద్దామంటే నాకువీలుకలగలేదు.

"ఎప్పుడూ మొహం యిట్టేచూపెట్టడం, అట్టే తుఱ్ఱున పారిపోవడం. ఎక్కడసిగ్గోగాని, నాపాలింటి కొచ్చింది" అనుకునేవాణ్ణి నేను.

మాఅత్తవారింట్లో నాదినచర్య ఏమంటే : ఉదయాన్నే కాఫీతాగి మేడ యెక్కడం, మళ్లీ పదకొండు గంటలకి అన్నం తిని మేడ యెక్కడం, నిద్రపోవడం, మూడుగంటలకి ఫలహారం చెయ్యడం, సాయంత్రం షికారు—ఇవి క్రమం తప్పకుండా జరిగించేవాణ్ణి.

౪

నాకు మేడమీద గది బసకి యిచ్చేరు. మా మామగారు కచేరీకి వెళ్లిపోతే ఆమేడమీద నేను ఒక్కడినే ఉండేవాణ్ణి. యేదో నోవలు పట్టుకుని కాలం గడపడం నాపని.

ఆగదిలో నాభార్య తయారుచేసినవి అనేక రకాల కుట్టుపనులు అద్దాలలో కట్టి గోడలకి తగిలించి ఉండేవి. అవన్నీ చూసి ఆమెకు కుట్టుపనిలో ఉన్న తెలివితేటలకి మనస్సులో మెచ్చుకునేవాణ్ణి.

ఇంతలో నాప్రయాణంరోజు వచ్చింది. ఉదయం పదకొండు గంటలకి మామామగారు కోర్టుకి వెళ్ళిపోయేరు. నేనుకూడా మామూలుగా భోంచేసి మేడమీది కెళ్లేను.

అక్కడ నేను పడుకునే తలదిండుకింద తాములపాకుల చిలకలు యథాప్రకారంగాపెట్టి ఉన్నాయి. అవి నవులుతూ పరుపుమీద కూర్చుని నాపెట్టెవేపు చూసేసరికి తలుపు తెరచివుంది.

నేను దిగువకు వెళ్లినప్పుడు పెట్టె మూసి వెళ్లినందుచేత 'యీమధ్యకాలంలో యెవరు తెరిచి ఉందురా?' అని అనుకుంటూ పెట్టెదగ్గిర కెళ్లి ఒక్కొక్క వస్తువా పైటికితీసి చూసుకున్నాను. అన్నివస్తువులూ సరిగా ఎక్కడివక్కడ వున్నాయి.

అన్నీతీసేసరికి పెట్టె అడుగున ఒకజేబురుమాలు మాత్రం మిగిలింది. అది నాకంటికి కొత్తగా కనపడడంచేత పైకితీసి పరీక్షించేను.

ఆ జేబురుమాలుచుట్టూ అతిసొగసైన లతలు కుట్టబడి ఉన్నాయి. ఆ అందానికి నేను మెచ్చుకుంటూ చూసేసరికి ఆ రుమాలుమధ్యనున్న పెద్దలతలో చక్కని అక్షరాలు కుట్టబడిఉన్నాయి. మో॥ రా॥ అనిన్నీ, దానికిందనే రా॥ ల॥ అనిన్నీ జోడిఅక్షరాలు నాకు అక్కడ కనపడ్డాయి.

'యీజోడి అక్షరాలు ఎవరిపేర్లు? యీ రుమాలు యిక్కడి కెలా గొచ్చింది?' అని నే నాశ్చర్యపోతూ ఆలోచించేను.

మో॥ రా॥ అంటే 'మోహనరావు' అనే నాపేరేకదా అనుకున్నాను. వెంటనే రా॥ ల॥ అంటే నాభార్యపేరైన 'రామలక్ష్మి' అయివుండాలి అని తోచింది. ఇంక యీపని చేసిన దెవరో మీరుఊహించుకోవలసిందే.

వ్యక్తురాలు కాక పూర్వం అత్తవారింట్లో భార్యతో అనుభవాలు యీకథ చదివేవాళ్లలో చాలామంది తెలుసుకునే ఉంటారు కనుక ఆవిషయమై నేను అధికం చెప్పలేదు. నాభార్య తెలివితేటలు గ్రహించడానికని పై సంగతి ఒక్కటిమాత్రం చెప్పక తప్పిందికాదు.

౫

ఇల్లా ఉంటూఉండగా ఒకనాడు సాయంత్రం నేను మామ్మూలుగా తోటలో షికారుచేస్తున్నాను. తూర్పువేపున ఉన్న సపోటాఅంట్లు కొత్తగా వేయించడంచేత పరీక్షచేసుకుంటూ నేను విలాసంగా పచారు చేస్తున్నాను. అప్పుడు అప్రయత్నంగా నాచూపులు మాపక్కతోటలో ఉన్న మావిడిచెట్టుకిందికి పోయేయి.

ఆ లేతమావిడి గున్నకింద యిద్దరు అమ్మాయిలు కూర్చున్నారు. అందులో పెద్దపిల్లకి పధ్ధాలుగు సంవత్సరాలు వయస్సుంటుంది. చిన్నదానికి పదేళ్లుండవచ్చును.

వాళ్లిద్దరూ సంతోషంగా మాట్లాడుకుంటూ



నవ్వుకుంటూ ఉన్నారు. నేనుకూడా వాళ్లని ఆనందంతో చూస్తూ అలాగ కొయ్యబొమ్మలాగ నిలబడిపోయేను.

మరికొంతసేపటికి వాళ్లిద్దరూ నావేపు చూశారు. అంతలో పెద్దపిల్ల దృష్టులతో నాదృష్టు లేకమైపోయేయి. తక్షణం ఆ అమ్మాయి తనచూపులు మళ్లించుకుంది.

వాళ్లు బాగా సాయంకాలమైనతర్వాత యింటికి పోయేరు. అంతవరకూ నేను వాళ్లని అలా చూస్తూనే వున్నాను.

వాళ్లు వెళ్లిపోవడం చూసి, అక్కడే సపోటా చెట్లకి గొప్పు తవ్వుతూవున్న మాతోటమాలీ లచ్చన్నని పిల్చి, 'ఆ అమ్మాయి లెవ్రళ్లా?' అని అడిగేను.

'అగ్గురోరంలో నారాయణశర్మగారి కూతుళ్లు బాబూ! ఆతోట ఆరిదేగామూ?' అని వాడు చెప్పగానే సరేకదా అనుకుని యింట్లోకి పోయేను.

౬

రోజూ సాయంకాలం నేను అదేసలానికి వెళ్లుతూవుండేవాణ్ణి. ఆఅమ్మాయిలుకూడా తరుచు వాళ్లతోటలోకి వస్తూవుండేవారు. ఒక్కొక్క నాడు ఆపెద్దఅమ్మాయి ఒక్కత్తే వస్తూవుండేది.

ఒకనాడు నేను మా మాలతీపందిరలో కూర్చుని ఏదో ప్రబంధం చదువుకుంటున్నాను. లచ్చన్న ఆపక్కనే సపోటాచెట్లకి నీళ్లు పోస్తున్నాడు.

అప్పుడు పక్కతోటలో నుంచి 'లచ్చన్నా!' అని శ్రావ్యమైన కంఠస్వరముతో ఒక పిలుపు వినపడ్డది. లచ్చన్న తలయెత్తి చూసేడు. ఆఅమ్మాయిలలో పెద్దయామె వాళ్ల తోటలో నిలబడి, 'లచ్చన్నా! మీతోటలో మల్లెపువ్వులున్నాయేమో కొంచెం తెచ్చిపెడుదూ!' అన్నది.

లచ్చన్న లేచి బంగాళాదగ్గిర కెళ్ళి యిన్ని మల్లెపువ్వులు అరిటాకులో పొట్లంకట్టి ఆమెచేతికిచ్చేడు. ఆమె సరీగా అవి అందుకునే సమయంలో నేను మాలతీనికుంజంలోనుండి హాఠాత్తుగా బైట కొచ్చి, 'లచ్చన్నా! తోటలో పువ్వులన్నీ యెవరినీ పడగకుండాఅందరికీ పంచిపెట్టేస్తున్నావట్రా' అని ఆమె వినేటట్టుగా అధార్టీ చేసేను.

నిజానికి మల్లెపువ్వు లామెకి యివ్వడం నా కిష్టమే కాని ఊరికే దర్జాకోసం అలాగన్నాను.

రాత్రి యింటికి పోయినతర్వాత లచ్చన్నని వేరే పిల్చి, 'ఒరేయి, లచ్చన్నా! నేను యిందాకా కేకలేసేనని నువ్వు మరోలాగ అనుకోకుమా! నువ్వు ఆఅమ్మాయికి మల్లెపువ్వు లివ్వడం నా కిష్టమే. మనతోటలో రాలి నేలని పడిపోయి వృథాగా పోయేకంటె యెవరో ఒకరు వాటిని ఉపయోగించడం మంచిదే' అని మంచిమాట్లాడి ఒక అర్ధరూపాయి చేతులో పెట్టేను.

"బాబూ! సిత్తం, నే నెరగ నేంటండి? తాతయ్యగారి నాటినించీ లోగిట్లో కనిపెట్టుకున్నాను. వీ ద్రేహంలో ప్రేవుల కోసినా త్రపు రక్తమేను బాబయ్యా! అమ్మగారికక్కడుంటే ఒక్కపువ్వు పైకి పోనిస్తానా అండీ, పీక లెగిరి పోవాలిగాకీ" అని లచ్చన్న జవాబు చెప్పేడు.

౭

అది మొదలుకొని రోజూ ఆఅమ్మాయి వాళ్లతోటలోకి వస్తూవుండడం, లచ్చన్న పువ్వు లిస్తూవుండడం జరుగుతూ వుండేది. నేను ఆపక్కనీ యీపక్కనీ తిరుగుతూ సాయంకాలానికి ఒక్కసారి అక్కడికి చేరుకుని, ఆ అమ్మాయి చూపుల్లో నాచూపులు కలుపుతేగాని ఉండలేక పోయేవాడిని.

ఒకనాడు ఆమెకి లచ్చన్న పువ్వు లిస్తున్నాడు. ఆసమయంలో నే నక్కడేవుండి ఊరుకోకుండా, 'లచ్చన్నా! పువ్వులేమేనా బాగున్నాయా?' అని అన్యాపదేశంగా అడిగేను. ఆ అమ్మాయి కూడా అది గ్రహించి, 'మా అమ్మ, వదినా, చెల్లెమ్మ యీపువ్వులు చాలా బాగున్నాయని మెచ్చుకున్నారు' అని మృదుమధురంగా అన్యాపదేశంగానే మందహాసంతో జవాబు చెప్పేసింది. ఆజవాబు తెలివితేటలకి నేను మెచ్చుకుంటూ ఆమె వెళ్ళిపోయేదాకా అక్కడే వుండి యింటికి పోయేను.

అది మొదలుకొని హరిహరబ్రహ్మాదులు తల్లక్రిందులుపడినా, భూనభోంతరాళాలు ఏకమైనా సరేగాని, నేను నారాయణశర్మ తోటవైపు రోజూ వెళ్లడం మానేవాణ్ణికాను. ఆఅమ్మాయికూడా విధిగా ప్రతి రోజూ నాకు దర్శన మిస్తూనే వుండేది.

ఇంక వెయ్యి చెప్పడం యెందుకూ? క్రమంగా యిద్దరికీ పరిచయం అధికమైపోయింది. అన్యాపదేశాలు పోయి ముఖస్తంగా మాటలు ప్రారంభమయేయి.

ఆఅమ్మాయి వాళ్లతోట దాటి మాతోటలో అప్పుడప్పుడు వస్తూ వుండేది. మేమిద్దరమూ అనేకవిషయాల్ని గురించి సంభాషిస్తూవుండేవాళ్లం. ప్రశాంతచంద్రికాకలితనిశాముఖము లనేకములు మా కామాలతీనికుంజంలో సౌఖ్యప్రదంగా గడిచిపోయేయి.

ఉదయం లేచినదే మొదలు 'ఎప్పుడు సాయంత్రం అవుతుంది? ఎప్పుడు ఆమెతో హాయిగా మాట్లాడుతాను?' అనే ఆలోచనలు దొంతరదొంతరలుగా వచ్చి మరొక ఆలోచనకి చోటిచ్చేవికావు. రాత్రి మంచం మీద పడుకుంటే అన్నీ ఆమెనుగురించినకలలే.

రత్తమ్మ మనోహరాకారం నాకళ్లకి కట్టినట్టుగా వుండేది. ఆమెనుగురించిన తలపులు నాకు అమృతప్రాయంగా వుండేవి. ఇలాగ్గా మాస్నేహలత క్రమంగా అల్లుకుపోయి విడిదియ్యడానికి వీలులేనిదై పోయింది.

౮

నేనొకనాడు మామూలువేళకే ఎప్పటిచోటికే వెళ్లేనుగాని రత్తమ్మమాత్రం యేకారణంచేతనో రాలేదు. నాకేమీ తోచక తలవంచుకుని అటూయిటూ తిరుగుతున్నాను. అనేక ఆలోచనలు నామనస్సులో కలిగేయి.

క్రమంగా సాయంత్రమైంది. దక్షిణగాలి చల్లగా, మందంగా వీస్తూ హాయి కలిగిస్తూంది. అనేకరకాల చెట్లు అగాలికి సంతోషంగా తలలూపుతూ ఒకవిధమైన మర్మరధ్వని చేస్తున్నాయి. నిర్మలమైన ఆకాశంమీద కొద్ది చుక్కలతో చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రకాంతి పడి మాతోటలోని కొబ్బరిచెట్ల ఆకులు మిలమిల మెరుస్తున్నాయి. నిశ్శబ్దమై ప్రశాంతమై ఆసమయం గంభీరంగా ఉంది.

అప్పటికి రత్తమ్మ రాలేదు. ఇంక రాదుకాబోలని నేను పోదల్చుకుంటూ నారాయణశర్మ తోటలోకి కడసారి చూసేను. ధవళవస్త్రాచ్ఛాదితయై మేలిముసుగున ఒకవ్యక్తి నావంకకి వస్తూంది. సుపరిచితములైన ఆనడకలను బట్టి ఆవ్యక్తి రత్తమ్మయని నిముషంలో తెలుసుకున్నాను.

ఆవ్యక్తి తిన్నగా మాలతీ కుంజంలోనికి వెళ్ళింది. నేనున్నూ ఆవెనకనే పోయి రత్తమ్మని కౌగిట్లో



చేర్చుకున్నాను. మర్నాడు తన అత్తవారింటికి ప్రయాణమనిన్నీ, ఆప్రయాణపు తొందర్లలో ఉండడంవల్ల రావడం ఆలస్యమైందనిన్నీ రత్తమ్మ నాతో చెప్పింది.

నా విచారానికి మేరలేదని నేను చెప్పాలా? అయితే యేంచెయ్యగలను? నేను అట్టే విచారిస్తే నాకంటే అధికంగా విచారిస్తూవున్న రత్తమ్మ బెంగపెట్టుకుంటుందని ఆమెని ఓదార్చేను.

క్రమంగా రాత్రి అధికమైపోతూ వున్నందున రత్తమ్మ వెళ్ళిపోడానికి తొందరపడుతూంది. అప్పుడా ప్రశాంత సమయంలో చంద్రుడూ, నక్షత్రాలూ, దైవమూ సాక్షిగా ఇకముందెన్నడూ ఒకరినొకరము ప్రేమించుకొనుట మానకూడదని మేము ప్రమాణాలు చేసుకున్నాము. రత్తమ్మ నన్ను వదలలేక వదలలేక వెళ్ళిపోయింది.

అతిభారమైన హృదయంతో కన్నీటితో నేను యింటివేపు నడిచేను. మొదట మేము ప్రేమించుకున్నప్పుడు యీ వియోగముమాట తల్చుకోనేలేదు.

* * * * *

## ౬

రత్తమ్మ అత్తవారింటికి వెళ్ళినది మొదలు నాకు ప్రపంచకం అంధకారమైపోయింది. ఆమె సుందరవదనము నాదృష్టిపథంలో నిల్చి ఎడబాయకుండా ఉండేది. వ్యవసాయంమీద దృష్టిలేదు; వ్యవహారంమీద మనసులేదు. ఏదో వెర్రివాడిలాగ తిరిగేవాడిని.

రోజూ సాయంత్రంవేళ నేనూ రత్తమ్మా హాయిగా గడిపినచోటికి పోయి, ఆసుఖానుభవాలు తల్చుకుంటూ విచారంతో సాయంత్రాలు గడిపేవాణ్ణి. శూన్యమైపోయిన ఆమాలతీని కుంజాన్ని చూసేసరికి నాహృదయం కరిగి నీరైపోయేది. నేటికికూడా ఆప్రదేశాలన్నీ నాకు బహుపవిత్రంగా కనబడతాయి.

చదువుకోడానికని చేతులో పుస్తకం పట్టుకునేవాడినేకాని దృష్టిమాత్రం రత్తమ్మమీదనే ఉండేది. నాకు పరధ్యానం హెచ్చైపోయింది.

ఇంతలో నాకు కార్యం చేసేయ్యాలని మామామగారు తొందరపడుతూ ఉత్తరం రాసేరు. మాఅమ్మ సమ్మతి చూసుకొని ప్రస్తుత విచారం కొంత తగ్గుతుందేమో అనే ఆశతో నేనూ అందుకు అంగీకరించేను.

మరికొన్నిరోజులకి రామలక్ష్మి నాగృహలక్ష్మిలాగ మాయింట్లో తిరుగుతూంది. ప్రాణేశ్వర స్నేహలాలనమున నాబాధ కొంత ఉపశమించింది. కాని పూర్తిగా తగ్గలేదు.

రామలక్ష్మి నామీద మిక్కిలి ప్రేమగలపిల్ల. నాసౌఖ్యమే తన సౌఖ్యంలాగ చూసుకునేది.

ఇల్లా ఉండగా ఒకనాడు నేను మాతోటలో ఒకగున్నమావిడిచెట్టుక్రింద కుర్చీ వేయించుకొని కూర్చున్నాను. చేతులో పుస్తకం ఉంది గాని మనస్సు రత్తమ్మమీదనే వుంది.

ఇంతలో నాదగ్గిరకి పోస్టుమనిషి వచ్చి ఒకకవరు అందిచ్చేడు. అతను నాచేతికి ఉత్తరం యిచ్చేవరకూ, అతను వస్తూన్న సంగతి నాకు తెలియనే తెలియదు.

ఉత్తరం పైవిలాసంలో ఉన్న దస్తూరీ నాకు క్రొత్తగా కనపడ్డది. నేను మెల్లిగా కవరు చింపి లోపల నున్న కాగితం పైకి తీసి చదివేను. అందులో యిలాగ్గా ఉంది.

"శ్రీ..................................

"హృదయేశ్వరా! 19-5-19

"నమస్కారములు. మిమ్మల్ని వదలివచ్చి రమారమి సంవత్సరం కావచ్చింది. మళ్లీ యింతవరకూ మిమ్మల్ని చూడ్డానికి నాపాపిష్టికళ్లు నోచుకోలేదు. ఎన్నడు మీదరహాస చంద్రికలలో తేలుతూ మీతో సుఖించే యోగ్యత ఉందో తెలియదు.

"ఇక్కడ నేను పడే బాధలు మీకు చెప్పి మీమనస్సుకి కష్టం కలిగించడానికి నాకు సమ్మతిలేదు. ప్రథమమున అనుకూలించని దాంపత్యమే అతిదుఃఖకరము. ఈయింట్లో నరకబాధ అనుభవిస్తూన్నానంటే నాబాధ మీకు వేరుగా తెలియచెయ్యనక్కరలేదు. క్రమంగా నాకీ జీవనంమీదనే విరక్తి కలుగుతూంది. ఎలాగో మీరు నన్ను రక్షించకపోతే మీపాదాలు తలుచుకుంటూ ప్రాణాలు వదిలేయ నిశ్చయించుకున్నాను. వీలులేక యిన్నాళ్లు మీకు జాబు వ్రాయజాలనైతిని. క్షమించవలెను. సెలవు.

ఇట్లు,
"మీప్రియురాలు, రత్తమ్మ."

## ౧౦

ఆఉత్తరం పూర్తిగా చదివేసరికి నాగుండెలు కొట్టుకోవడం ప్రారంభించేయి. రత్తమ్మ యెట్టిబాధలు పడుతుందో అని నాకడుపు చెరువైపోయింది. ఆమె కష్టాలు తగ్గించే మార్గం నాకేమీ తోచక అలాగ ఆవుత్తరంవేపు చూస్తూ కూర్చున్నాను.

ఇంతలో యెవరో వచ్చి వెనకనించి నాకళ్ళు మూసేరు. అతిమృదులములైన ఆహస్తములు రామలక్ష్మివని నేను గ్రహించి ఉత్తరం మూసేసేను. రామలక్ష్మి కళ్లమూత వదలివేసి నాచేతిలో ఉన్న ఉత్తరంవేపు చూస్తూ,



మందహాసంతో, 'నేను చూసేసేనులెండి' అన్నది.

'ఏమిటి చూసేసేవు?'

'ఆవుత్తరం.'

'ఏవుత్తరం?'

'ఆవుత్తరమే.'

'నిజంగానే?'

'నిజంగానే!'

నాకు ధైర్యం తగ్గిపోయింది. అయినా దిటవు తెచ్చుకొని, 'ఏంచూసేవో చెప్పూ చూద్దాం' అన్నాను.

'నేను చెప్పను. మీరే చెప్పండి.'

'నేనూ చెప్పను.'

'ఎప్పటికైనా నాతో చెప్పకుండా మీకు వీలులేదు.'

'ఊఁ—పోదాం.'

'ఊఁ—సరే—చూద్దాం.'

రామలక్ష్మి చిరునవ్వుతో యింటికి వెళ్ళింది. నే నలాగే చాలాసేపు కూర్చొని ఆలోచించాను. కాని రత్తమ్మకి సహాయంచేసే మార్గం నాకు దొరకలేదు. ఆరోజున నాకు బెంగచేత భోజనం రుచించలేదు.

## ౧౧

రెండు నెలలు గడిచినవి. రత్తమ్మదగ్గిరనుంచి మరి ఉత్తరంలేదు. కాని యింతలోనే రత్తమ్మభర్త మరణించేడనిన్నీ, నారాయణశర్మ కూతుర్ని యింటికి తీసుకొచ్చేసేడనిన్నీ ఒకవార్త తెలిసింది.

'ఇదేమిట్రా? యింతలోనే యీఆవాంతరం!' అని ఆలోచిస్తూ ఆనాటి సాయంకాలమే నారాయణశర్మ తోటవైపున్న మాలతీనికుంజములో చాలాసేపు కూర్చున్నాను. రత్తమ్మ వస్తుందేమో అనుకున్నానుగాని ఎంతకీ రాలేదు.

అప్పటినుంచీ నేను ఒక్కడినే ఆతోట ప్రతిరోజూ బాగా చీకటిపడేవరకూ రత్తమ్మకోసం యెదురు చూస్తూ కూర్చునేవాణ్ణి. వరసగా రెండు నెలలు నేను అదేప్రకారం చేసేను, కాని రత్తమ్మదర్శనం కాలేదు.


ఇంక రత్తమ్మ యెన్నటికీ రాదని అనుకున్నాను. ఆమె జాబుకి నేను జవాబు రాయకపోవడంచేత ఆమెకి కోపం వచ్చిందేమో అనుకున్నాను.

ఒకనాడు చాలాసేపు కూర్చొని, నిరాశచేసుకుని, యింటికి పోదామని బైలుదేరేను. అప్పటికప్పుడే యేడుగంటలు కావస్తూంది. దశమిచంద్రుడు వినిర్మలాకాశాన ప్రకాశిస్తున్నాడు. విశాలగగనతలమున ఒక్క చిన్న తెల్లనిమేఘము మాత్రము మందగతిని ప్రయాణం చేస్తూంది. అంతవరకూ విహంగరావాలచేత కలకలలాడుతూవున్న తోటలో యిప్పుడు గంభీర నిశ్శబ్దం నిల్చింది.

జరిగిన సంఘటనలనీ తల్చుకుంటూ నేను లేచి బైటికి వచ్చి నారాయణశర్మ తోటవైపు చూసేను. ధవళవస్త్రాచ్ఛాదితయైన ఒకవ్యక్తి ఆవెన్నెలలో మెల్లగ నడచిపోతూంది. ఒక్కనిముషంలో ఆమె రత్తమ్మ అని గ్రహించి పరుగున ఆమెదగ్గిర కెళ్ళి చెయ్యి పట్టుకున్నాను. రత్తమ్మ నిలబడిపోయింది.

నే నామెను మాతోటలోని మాలతికుంజంలోకి తీసుకుపోయేను. ఆమె నిశ్చలంగా అందులో నిలబడ్డాది. ఒక్క చంద్రకిరణం దట్టంగా ఉన్న మాలతీఆకులలోనుంచి దూరి రత్తమ్మ సుందరవదనంమీద పడుతూంది. ఆకాంతిలో ఆమె ముఖాన్ని చూడ్డానికి నాకు వీలు కలిగింది.

విషాదపూరితమై, మ్లానమై, దుఃఖోద్రేకపూరితమై యున్న ఆమె ముఖాన్ని చూసేసరికి నాకు విచారమాగలేదు. నాకండ్లవెంట వస్తూవున్న నీళ్లని ఒత్తుకుని



రత్తమ్మని నాకౌగిట్లో చేర్చుకున్నాను. ఆమెశిరసు నావక్షస్థలంమీద ఆనుకుని కూర్చున్నది.

శీతలములై, మృణాలసదృశములైయున్న ఆమె హస్తములను నాచేతులతో పట్టుకున్నాను. ఆ మధుర స్పర్శసుఖానుభవంచేత నాశరీరం పులకాంచితమైంది.

ఉన్నకొద్దీ రత్తమ్మకి దుఃఖభారం అధికమై పోతూంది. ఆమె కళ్లనుండి అవిరళంగా నీళ్లు వస్తూన్నాయి. నాజేబురుమాలు తీసి ఆమె కన్నీళ్లు ఒత్తుతూ నేనిలాగన్నాను. 'రత్తమ్మా! నువ్వు ఆలాగ విచారిస్తే యేంలాభం చెప్పూ? నీవుత్తరం చూసి నువ్వు పడుతూవున్న కష్టాలు తల్చుకొనేసరికి నాగుండెలు బద్దలై పోయేవి. ఏంచెయ్యనూ? నీదగ్గర కొద్దామని యెన్నివిధాల ప్రయత్నించినా భగవంతుడు నాకు సహాయం చెయ్యలేదు. నన్ను నీవు క్షమించవలసి ఉంటుంది. నువ్వు యిక్కడి కొచ్చేవని విన్నదగ్గిరనించీ రోజూ యిక్కడికి వస్తూనే వున్నాను. కాని నీదర్శనంమాత్రం యీనిర్భాగ్యుడికికాదు. నామీద నీకు కోపం వచ్చిందనుకున్నాను. రత్తమ్మా! చూడూ, యీప్రపంచంలో యెవరికి కోపం వచ్చినాసరే కాని, నీకు నామీద కోపం వచ్చిందంటే నేను సహించలేను. ఇదివరకు నేను చేసినవన్నీ అపరాధాలే. దయవుంచి నన్ను క్షమించవూ?'

ఆమె జవాబుకోసం యెదురుచూస్తూ నేను క్షణం ఊరుకున్నాను.

౧౨

రత్తమ్మ మారుపలుకలేదు. ఆమె ఒక్కదీర్ఘనిశ్వాసంమాత్రం విడిచింది. అమె నింకనూ నేను దగ్గరగా తీసుకుని మళ్లా చెప్పేను. 'ఇన్నిరోజులనుంచీ నువ్వు నాకు కనపడకపోవడం నాఅదృష్టమే అనుకుంటాను. ఇకముందైనా నాతప్పులన్నీ క్షమించి యథాప్రకారం నువ్వు ప్రవర్తించవలసివుంటుంది. నువ్వు యిప్పుడు స్వేచ్ఛగా యింట్లోకి వచ్చి నాభార్యని ఒకసోదరిలాగు చూసుకుంటూ వుండవచ్చును. నాయిల్లు నీది. నాసర్వస్వం నీదే. ఏం? నీ కిష్టమేనా?—జవాబు చెప్పవూ?'

ఆమె రెండుమూడు నిముషాలవరకూ మాట్లాడలేదు. తర్వాత పొంగివస్తూవున్న దుఃఖాన్ని ఆపుకుని మెల్లిగా డగ్గుత్తికతో జవాబు చెప్పింది:

'మీమీద నా కేవిధమైన కోపమూ లేదు. ఇక్కడ వున్న రోజుల్లో నామీద ఎంతో ప్రేమ వుంచి మీ హృదయంలో నాకింత తావిచ్చిన దయాహృదయులగు మీమీద నాకు కోపం యెలా గొస్తుంది? మీరు మాఅత్తవారింటికి రాకపోవడానికి అనేక కారణా లుంటాయి. నే నీపూరు వచ్చినదగ్గరనించీ, ప్రతిరోజూ యీచెట్టుచాటున వుండి మీదివ్యముఖారవిందాన్ని చూస్తూనేవున్నాను. నేను రానందుకు మీరు విచారించడంకూడా కళ్లారా చూస్తూనేవున్నాను. కాని యీనిర్భాగ్యదశలో, యీపాపపుముఖాన్ని మీకు చూపించడానికి నాకు ధైర్యం లేకపోయింది.'

దుఃఖోద్రేకంచేత రత్తమ్మ మాటలాడలేక పోయింది. నే నామెని కౌగిలించుకుని బుజ్జగించేను. ఆమె మరికొంతసేపటికి సేవదేరింది.

'నే నింకెన్నడూ మీదగ్గరకి రాకుండానేవుందామనుకున్నాను. ఇన్నాళ్లూ ఆపుకున్నప్పటికీ నామనసు యీరోజున నావశం గాలేదు. అందుచేత మీకళ్లబడ్డాను.'

'ఏమిటి రత్తమ్మా! నాదగ్గరే నువ్విలాగ కొత్త చెయ్యడం? సర్వం నువ్వే అని నమ్మకున్న నాదగ్గర నువ్విలాగ ప్రవర్తించడం ధర్మంగా వుందా?'

'ఇన్నాళ్లూ నేను మీకు కనపడకుండా ఉండడానికి యింకో ప్రబలమైన కారణం ఉంది. నేను యెన్ని జన్మాలకైనా తీర్చలేని ఒకపాపపుపని చేసేను. నమ్మిన స్నేహితురాలిని మోసంచేసేను. ఏనిర్మలహృదయం నాప్రాణస్నేహితురాలో, ఏ అమృతురాలిస్నేహభావాలు నా కత్తవారింట్లో ఓదార్పుగా వుండి ధైర్యం కలిగించేవో, ఆమెను నేను మోసగించేను. నానేరము క్షమార్హమైనది కాదు.'

భావోద్రేకంచేత ఆమెకంఠం రుద్ధమైపోయింది. నే నామెకన్నీటిని ఒత్తుతూ కూర్చున్నాను. 'రత్తమ్మా నీమాటలు నా కర్థం కాలేదుసుమా. ఎవరితో మాట్లాడుతున్నావో యెరుగుదువా?' అన్నాను.

'నామాటలలోని అర్థం మీకు వింటూన్నకొద్దీ తెలుస్తుంది. ఏహృదయానికి నాస్నేహితురాలు సర్వాధికారిణియో, ఏహృదయం నాకు అందరానిదో, అట్టి మీ హృదయంలో నేను స్వతంత్రించి అడుగు పెట్టేను. మిత్రద్రోహంకంటె వేరే పాపం లేదు.

'హృదయేశ్వరా! యింకా మీకు తెలియలేదా? మీభార్య రామలక్ష్మి నాకు మాఅత్తవారింట్లో ప్రాణదానంచేసిన స్నేహితురాలు. సర్వప్రపంచకం శూన్యమై కష్టాలతో నిండిపోయినప్పుడు నాకు ఆశావేశము చూపించినది రామలక్ష్మి. ఆమెముఖం చూస్తే సర్వపాపాలు నాశనం అయిపోతాయి.'

'మీరు నన్ను ఆమె పవిత్ర సన్నిధిలోనికి రమ్మని చెప్పుతున్నారు. ఆమహాత్మురాలిదివ్యసందర్శనం చెయ్యడానికి యీనిర్భాగ్యురాలికి అర్హత లేదు. ఆవిడపాదాలు పట్టడానికేనా నాకు యోగ్యత లేదు. పాపభూయిష్ఠమైన నాముఖం చూపెట్టి, ఆమె పవిత్రసాన్నిధ్యాన్ని పాపపంకిలం చెయ్యడానికి నాకు యిష్టం లేదు.

'నేను మొదట యిది మిత్రద్రోహమని తెలియక చేసేను. మీయందు నాకుగల గాఢానురాగము నన్ను ముందువెనకలు చూడనియ్యలేదు. ఇంకనుంచి యెన్నటికైనా యిట్టి పాపకృత్యం చెయ్యలేను. ప్రజ్వలిస్తూవున్న అగ్నిహోత్రాన్ని చేరే శలభములాగు, పవిత్రహవిర్భాగమును సమీపించే శునకంలాగు, మహాసాధ్వినీ, నిర్మలహృదయయున్నూ అయిన రామలక్ష్మి నిరాఘాటంగా రాజ్యం చెయ్యవలసిన మీహృదయంలో నేను అడుగు పెట్టేను.

'ఆమె హృదయం శిరీషకుసుమకోమలమైనది. అట్టి పతివ్రతకు నే నిట్టిద్రోహము చేసినట్టు తెలిసిందంటే నాప్రాణాలు పై కెగిరిపోతాయి. ఆమె మనస్సుకి కష్టం కలిగించడం నా కిష్టం లేదు.

'కనుక ఆమెయున్నూ, మీరున్నూ సుఖిస్తూవుంటే, మిమ్మల్ని దూరంనుండి చూస్తూ నాకాలం అంతా గడిపేస్తాను. మీరు యింక యీనిర్భాగ్యురాలిని మరిచిపోవాలి అని ప్రార్థిస్తాను. రత్తమ్మ అనేనేస్తురాలు ఇంక మీకు ఎన్నడూ కనపడదు.'

ఆమెకు భావోద్రేకం హెచ్చైపోతూంది. ఆమెవక్షఃస్థలం తరంగసంక్షోభితమైన సముద్రంలాగు కొట్టుకుంటూంది. 'రత్తమ్మా! నీమాటలు నేను వినలేను. మనం నాటిరోజుల్లో చేసుకున్న ప్రమాణాలు జ్ఞాపకం చేసుకో. నావల్లనున్న లోపాలు మరిచిపోయి నన్నేలుకోవాలి—'

రత్తమ్మ—'మీప్రేమ నే నెరుగకపోలేదు. నిరాశానిదాఘవశాన్ని ఎండిపోయి బీటలుపారిన నాహృదయంలో ప్రేమవృష్టిని గురియించినది మీరేకదా! అబ్బా! ఆసౌఖ్యపురోజులు యింక నాజ్ఞాపకానికి తీసుకురాకండి. అవి నాకు కలలో వార్తలు. నాఆశలన్నీ మీమీదనే ఉండేవి. నాప్రేమ అంతా మీమీదనే ఉండేది. అయితే అదంతా నేను తెలియక చేసేను. అమృతమే నాపాలిటికి హాలాహలమైపోయింది. అందరాని ఫలంకోసం నేను ప్రయత్నిస్తూవున్నానని ఒక్కనాడైనా అనుకోలేదు. ఇంక నాకు యీజన్మానికి సుఖం లేదు. మళ్లీ జన్మానికా?—ఏమిటో!—'

'రత్తమ్మా! యెంత అమాయకురాలివి! నీభావాలు ఎంత పవిత్రమైనవి! సరే! రామలక్ష్మి సుగుణాలను న్వెరిగినవేకదా! ఆమె నిన్ను క్షమించి సోదరిలాగు చూసుకుంటానంటే నువ్వు యింట్లోకి వస్తావా? ఆమె స్వయంగా నిన్ను రమ్మని కోరితే నువ్వు వస్తావా?' అని నేనన్నాను.

ఆమె ఒక్కసారి నాముఖంవంక చూసింది. అంతవరకూ నిరాశాపూరితములైన ఆమె నేత్రాల్లో ఆశాజ్యోతి కనబడ్డాది. తెంపరాని ప్రేమలతను ఆమె ఛేదించడానికి ప్రయత్నిస్తూంది కాని సాధ్యం కాలేదు. అదే సమయంగా నేను 'నువ్వు సందేహించనక్కర్లేదు. రామలక్ష్మి తప్పకుండా నిన్ను గౌరవిస్తుంది. మీ రిద్దరూ కలిసి హాయిగా ఉండవచ్చును.

'రత్తమ్మా! నాకు నువ్వు లేకపోతే ప్రపంచకమే లేదు. నువ్వు నాకు కనపడకపోతే నా కీప్రాణం

వగాత్రం యెందుకూ? ఇంక నువ్వు జవాబుచెప్పాలి. రామలక్ష్మి వచ్చి నిన్ను స్వయంగా క్షమించిపిలుస్తే వస్తావా? రావా? ఈజవాబుమీదనే నాజీవితం ఆధారపడి ఉంటుం దన్నమాట జ్ఞాపకం ఉంచుకో. ఆలోచించి మరీ జవాబు చెప్పు' అన్నాను.

నేను మాటలు ముగించి ఆమె ముఖంవేపు చూస్తున్నాను.

## ౧౩

ఆనంతసౌఖ్యప్రదమైన ప్రేమరాజ్యం ఒకవేపూ, దుఃఖప్రపూరితమై శూన్యమైన ఒంటిజీవనం వేరొకవేపూ రత్తమ్మమనస్సును లాగడం ప్రారంభించేయి. భావసంఘర్షణచేతను ఆమెగుండెలు కొట్టుకుంటున్నాయి. ఆమెను నేను మరింతదగ్గరకి తీసుకొని కౌగిలించుకున్నాను. ఆమె మౌనముతో నాపరిష్వంగమునం దుండిపోయినది. ఆమెచూపులు దీర్ఘాలోచనమును సూచిస్తున్నాయి.

'రత్తమ్మా! యేం? జవాబు చెప్పవూ? రామలక్ష్మి వచ్చి కోరితే నువ్వు వస్తావా?' అని నేను నొక్కి అడిగేను.

ఆమె చాలాసే పాలోచించి కృతనిశ్చయురాలైనట్లు దీర్ఘనిశ్వాసము విడిచి ఎట్టకేలకు 'సరే' అన్నది.

నేను ఆనందపరవశుణ్ణనై పోయేను. 'అయితే రేపు యీవేళకి నువ్వు యిక్కడికి రావాలిసుమా' అన్నాను.

ఇంతలో మాలతీనికుంజము వెనుకనుంచి ఏదో చిన్నశబ్దము అయింది. తత్‌క్షణం రత్తమ్మ నాకౌగిట్లోనించి లేచి వాళ్లతోటలోకి పరుగెత్తి చెట్లచాటున మాయమైపోయింది.

"ఆచప్పు డేమిటి చెపుమా" అని నేను పైకి వచ్చేసరికి వెన్నెలలో రామలక్ష్మి దరహాసవదనంతో నిలబడి ఉంది. ఆమె నవ్వుతూ 'నేను వినేసేనులెండి' అన్నది.

'ఏమిటి విన్నావూ?'

'మీసంభాషణ అంతానూ.'

'ఏం విన్నావు?'

'ఏం జరిగిందో యిప్పుడైనా చెప్పరూ?'

'ఏమీ లేదు. ఊరుకుందూ.'

'పోనియ్యండి, నా కేమిటి?'

రామలక్ష్మి యింటికి పోయింది. నేనక్కడే కూర్చొని ముందు వెనుకలు బాగా ఆలోచించుకుని, రామలక్ష్మితో యీవ్యవహారం చెప్పక తీరదని నిశ్చయించుకుని భోజనానికి లేచేను.

తర్వాత గదిలో రామలక్ష్మికి జరిగింది యావత్తూ మొదటినుంచీ చెప్పేసేను. అది అంతా సాంతంగా వినేసరికి ఆమెకికూడా కళ్లలో నీళ్లు ప్రత్యక్షమయేయి.

'మీరు యింతవరకూ నాతో చెప్పకపోయినా యీసంగతు లన్నీ నాకు తెలుసును. తోటమాలీ లచ్చన్న, ఆవేళ మీఉత్తరం, ఈవేళ మీసంభాషణ, మనదాసీ అచ్చి – అందరూ నాకు యీవిషయంలో సహాయం చేసేరు.

'రత్తమ్మఅత్తవారిల్లూ, మాయిల్లూ దగ్గరగా ఉండేవి. పాపం! ఆవిడని తొంభైయేళ్ల ముసిలాడికి కట్టిపెట్టేరు. వాణ్ణి చూస్తేనే అసహ్య మేస్తుంది. ఆఅమ్మాయి కాపురం యెలాగ చేసేదో కాని, దానికి తోడు రాక్షసియేలుబడి ఉండేది ఆయింట్లో. రత్తమ్మ బహు అమాయకురాలు. ఆమెను చూస్తేనే నాకు జాలి వేస్తుంది. ఆవిడమనస్సూ, నామనస్సూ ప్రతివిషయంలోనూ ఒకటి.

'సాయంకాలం ఆవిడచెప్పిన మాటలవల్ల ఆమెకు నాయందుండే ప్రేమ అపారమైనదని తెలుస్తూంది. ఆవిడపశ్చాత్తాపము నిరుపమానమైనది. ఇన్నిటికీతోడు ఆవిడకి మీయందుండే ప్రేమకూడా నాకు తెలిసింది. అలాంటిప్రేమను భేదించడం నాకు కష్టంగా ఉంటుంది.

'రత్తమ్మ నాకు ఒకసోదరిలాగు ఉంటుంది. ఆవిడమనస్సు వెన్నలాంటిది. ఆహృదయంలో కల్మషానికి తావు లేదు. పవిత్రగంగాజల సదృశము లగు ఆమె అశ్రుబిందువు లింక జాలువారకూడదు. రేపు నేనే స్వయంగా వచ్చి ఆమెని తీసుకువస్తాను. నాతోపాటు ఆమెకి మీహృదయంలో సమానభాగానికి హక్కు ఉన్నట్టు నేను ఒప్పుకుంటాను.'

రామలక్ష్మి మాటలు నాకు అమృతపు సోనలైనవి. నాదుఃఖం ఉపశమించింది. ఆరాత్రి అంతా మర్నాటి కార్యక్రమాన్నిగురించి ఆలోచిస్తూ మేము గడిపేసేము.



## ౧౪

మర్నాడు సాయంత్రమైంది. సంధ్యారాగంలో మాతోట్లోని చెట్లన్నీ బంగారు నీరు పోసుకున్నట్లుగా ఉన్నాయి. మామిడిచిగుళ్లు కెంపుల్లాగ సంధ్యాకాంతిలో మెరుస్తున్నాయి. కోయిలలూ, రామచిలుకలూ తమదినాంతగీతాలు పాడుకుంటూ అడావిడిగా యెగురుతున్నాయి.

అప్పుడు నేనూ, రామలక్ష్మి మామాలతీనికుంజంలో కూర్చున్నాము. మరికొంతసేపటికి రత్తమ్మవాళ్ల తోటలోని మామిడిచెట్టుకిందకి వచ్చి నిల్చుంది. ఆమె ముఖం వాల్చుకొని ఉంది.

రామలక్ష్మి ఒక్కచెంగున అక్కడికి పోయి రత్తమ్మని కౌగిలించుకుంది. రత్తమ్మ రామలక్ష్మిపాదాల మీద వాలి కన్నీటితో కడిగేసింది. ఆమె రత్తమ్మని లేవనెత్తి, ధైర్యం చెప్పి తోటలోకి తీసుకొచ్చింది.

రత్తమ్మ దీనస్థితికి రామలక్ష్మికండ్లలో నీళ్లు ప్రత్యక్షమయేయి. స్నేహితురాళ్లిద్దరూ చాలాసేపు ముచ్చటించుకున్నారు.

చాలవరకు బోధపర్చిన తర్వాత రత్తమ్మ యింట్లోకి రావడానికి ఒప్పుకుంది. మేము ముగ్గురం తక్షణంయింటికిపోయేం.

ఇంట్లో దేవుడు పట్టుదగ్గిర కెళ్ళి, దైవానికితోడు రామలక్ష్మి సాక్షిగా, నాడు దైవసాక్షిగా తోటలో చేసుకున్న ప్రమాణికాలు తిరుగా మే మిద్దరమూ చేసుకున్నాము.

రామలక్ష్మి రత్తమ్మని చెల్లెలివలె చూసుకుంటూంది. రత్తమ్మ రామలక్ష్మియందు అతిభక్తితాత్పర్యాలతో తిరుగుతూంది.

అన్నట్టు, చెప్పడం మరిచిపోయేను: నారాయణశర్మ మాయింటికి ఆమర్నాడు పొద్దుటేవచ్చి, కూతుర్నిరమ్మని పెద్దకేక లేసి, 'హాత్ హూత్' అని బెదిరించేడు కాని రత్తమ్మ తన సునిశ్చితాభిప్రాయం చెప్పినతర్వాత అతడు నిరాశ చేసుకుని యింటికి పోయేడు.

నాటిమొదలు నేటివరకూ తండ్రిముఖం కూతురుగాని, కూతురుముఖం తండ్రిగాని చూసుకోలేదు. మాకూ వాళ్లకీ రాకపోకలే లేవు.

నేను అతిసౌఖ్యంగా నాహృదయేశ్వరు లిద్దరితోనూ బంగాళాకాపురం నేటికీ చేస్తూనే ఉన్నాను.

అప్పుడప్పుడు మేము ముగ్గురమూ కలిసి మాపవిత్రప్రేమ నాటకానికి రంగస్థలమైన మాలతీనికుంజంలో కూర్చొని, పూర్వపురోజులు జ్ఞాపకానికి తెచ్చుకుంటూఉంటాము.

ఇది చదివేవాళ్లలో యిటువంటి అనుభవాలు యెవరికేనా ఉన్నాయా? నవ్వకుండా చెప్పండీ, చూద్దాం.